# గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా : ఎమ్మెల్యే



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



# 'కంకర'రోడ్డు కష్టాలు... ఇంకెన్నాళ్లు?



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణం రైల్వే ఫ్లైఓవర్ వంతెన బైపాస్ రోడ్డు నుంచి గురుకుల పాఠశాల మీదుగా అంతర్గాం మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బి శాఖ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ఒక వరుస తారు రోడ్డు విస్తరణ పనులు చేపడ్తున్నారు. గురుకుల పాఠశాల నుంచి పెద్దంపేట వరకు రోడ్డును తవ్వి కంకర పోశారు. కంకరను రోలర్‌తో తొక్కించలేదు. రోడ్డు నిర్మాణ పనులు కూడ నిలిచాయి. దీంతో కంకర రాళ్ల దారిపై వాహనాలతో వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల టైర్లు పాడవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు కంకర రహదారిపై వాహనాలు నడిపేందుకు ఇబ్బంది పడ్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడ్తున్నారు. తారు రోడ్డు నిర్మాణం పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా రోలర్‌తో కంకర రాళ్లను తొక్కించి మొరం మట్టి పోయాలని సంబంధిత అధికారులను కోరుతున్న పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామగుండం పట్టణం నుంచి అంతర్గాం మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై పెద్దంపేట వద్ద రైల్వేగేట్ ఉంది. ఈ రహదారి మీదుగా మండలంలోని 15 గ్రామాల ప్రజలతోపాటు రామగుండం పట్టణ ప్రజలు, పాలకుర్తి, వెల్గటూర్ మండలాలకు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తారు. పెద్దంపేట వద్ద రైల్వేగేట్ పడితే నిత్యం గంటకుపైగా వాహనదారులు ఇరువైపుల పడిగాపులు పడాల్సి ఉంటుంది. ఇందుకోసం గతంలో ప్రత్యామ్నాయంగా రామగుండం పట్టణం రైల్వే ఫ్లైఓవర్ వంతెన బైపాస్ రోడ్డు నుంచి గురుకుల పాఠశాల మీదుగా అంతర్గాం మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బి శాఖ రోడ్డుకు అనుసంధానంగా ఈ బైపాస్ రోడ్డును నిర్మించారు. అయితే ఎస్.టి.కాలనీ సమీపాన 300 మీటర్ల మేర రోడ్డు పూర్తి కాకపోవడం, మట్టి రోడ్డు పూర్తిగా చెడి రాకపోకలకు ఇబ్బంది కావడంతో గత కొన్నేళ్లుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎట్టకేలకూ ఈ రహదారిని రెండు వరుసల రోడ్డుగా మార్చి సౌకర్యం కల్పించేందుకు ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. కానీ, రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా కంకర రాళ్ల దారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన పడ్తున్నారు. దీనికితోడు ఆదివారం నుంచి 3 రోజులపాటు పెద్దంపేట రైల్వేగేట్‌ను మూసివేశారు. ఈ కారణంగా ఇరువైపుల ప్రధాన రోడ్డుపై రాకపోకలు నిలిచాయి. వాహనాలు అన్ని దారి మళ్లి ప్రత్యామ్నాయ రహదారి అయిన కంకర రాళ్ల రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు మరింత పెరిగాయని అంతర్గాం మండల, రామగుండం పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను వారు కోరుతున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారం

## జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజావాణి అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల ప రిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు స మస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని,అధికారులు వారి శాఖల వారిగా స్వీ కరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర వి చారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాల ని అన్నారు.అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీల న జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 49 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యుడిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఉన్నారు.

# గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

## కరీంనగర్ మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా రెండో రోజు నవరాత్రి ఉత్సవాలు

## లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో సోమవారం గాయత్రీదేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘటంతో, గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వేదమాతగా, జ్ఞానప్రదాయినిగా, సకల చైతన్యానికి మూలశక్తిగా గాయత్రీదేవిని భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం, పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సుకు ప్రతీకగా నిలుస్తుంది. దసరా నవరాత్రుల్లో గాయత్రీదేవి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించడంతోపాటు జ్ఞానానికి, ధర్మానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని గుర్తుచేస్తుంది.

### జ్ఞానమార్గంలో నడిపించే జగన్మాత

గాయత్రీదేవి ఆరాధన ద్వారా విద్య, వివేకం, ఏకాగ్రత, సత్ప్రవర్తన కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, మంచి ఆలోచనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఈ ఆరాధనలోని ప్రధాన సందేశంగా భావిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఆలయంలో లింగార్జన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పిండితో లింగాకారం ప్రతిష్టించి అభిషేకం చేశారు. దీపాలు వెలిగించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ సహా పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సైతం దాండియా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు అధ్యాత్మిక భావనతో ఆడుతూ పాడుతూ దాండియాలో పాల్గొనున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే గడుపుతున్నారు. ఆద్యంతం దాండియా కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్

## 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన''ఛలో ఢిల్లీ''కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. ఢిల్లీలోని బరాఖంబ మెట్రో స్టేషన్ వద్ద తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నికల వ్యవస్థ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో ఏర్పడిన సందేహాలను నివృత్తి చేయాలంటే బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణకు చెందిన పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



వివరాలు మెయిన్‌లో...

# పత్తి కనీస మద్దతు ధర, కొనుగోళ్లకు ఏర్పాట్లు

# మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష: కలెక్టర్



ప్రజాపక్షం/పెద్దపల్లి:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన గోదావరిఖనిలో మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు తమ పరీక్షల సన్నద్ధతను అంచనా వేసుకుని, పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఈ మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. అక్టోబర్ 22వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతిగా రూ.10,000, రెండో బహుమతిగా రూ. 5,000, మూడో బహుమతిగా రూ. 2,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 100 మంది అభ్యర్థులకు ఉచిత ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆసక్తి గల అభ్యర్థులు https: //forms.g le/E ws qCLeErjgEPTih6 లింక్ ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7780543055, 8886304040 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాపక్షం/మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాలమండలంలోని మ్యాడంపల్లి గ్రామంలో తైదల సాహిత్ (16) అనే ఇంటర్మీడియట్ విద్యార్థి సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడిపల్లిలోని ప్రభుత్వ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సాహిత్ రెండు నెలలుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. తిరిగి హాస్టల్‌కు వెళ్లడానికి ఇష్టపడకపోవడం, చదువుపై ఆసక్తి లేకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తల్లి తైదల మంగ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల ఎస్ఐఎస్. సందీప్ తెలిపారు.

## కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు ప్రత్యేక సమావేశం

ప్రజాపక్షం/చొప్పదండి: కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిమిత్తం ఈనెల 14న మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ కీర్తి నాగరాజు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది అని ఆయన పేర్కొన్నారు. కావున సభ్యులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని సోమన్పల్లి గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే పాలు పట్టించాలని , నవజాత శిశువుకి తల్లిపాల ఎంత ముఖ్యమో వాటి విశిష్టత గురించి వివరించారు. అనంతరం కేంద్రంలో ఉన్న పిల్లలకు యూనిఫాం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెవుల గంగన్న,పంచాయతీ సెక్రెటరీ లక్ష్మి ,అంగన్వాడీ టీచర్లు,హెల్పర్ జమున ఉన్నారు.

## రాజకీయాలకు అతీతంగా బతుకమ్మ ఏర్పాట్లు సిద్ధం

ప్రజాపక్షం/ముత్తారం :తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ముత్తారంలోని కాసర్లగడ్డ–గుండ్లకుంట చెరువు మైదానాన్ని సిద్ధం చేశారు. మాజీ ఎంపిపి,జెడ్‌పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, యుద్ధప్రాతిపదికన మొరం పోయించి ఈ మైదానాన్ని చదును చేయించారు.స్థానిక సర్పంచ్ సుదాటి రవీందర్‌రావుతో కలిసి గ్రామ పెద్దలు,అన్ని పక్షాల నాయకులు ఈ పనులను పరిశీలించారు.వేడుకలకు అధిక సంఖ్యలో తరలివచ్చే మహిళల కోసం తాగునీరు,రాత్రివేళ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, దారికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తారం సర్పంచ్ రవీందర్ రావు,కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చం రావు, తాటిపాముల శంకర్,వార్డు సభ్యులు కుక్కల చందు,బిజెపి పార్టీ నాయకులు పెయ్యల కుమార్ తోపాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఇల్లు లేనివారు ఉండకూడదనే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

### సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల: నిరుపేద ప్రజలకు నీడ కల్పించాలని రాష్ట్రంలో ఇల్లు లేనివారు ఉండకూడదనే లక్ష్యంతో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని 11వ వార్డు ముష్టి పెల్లికి చెందిన దాసరి అరుణ, వేముల సత్యవ్వల యొక్క భూమి పూజ ఆయన చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు సిరిసిల్లలో వేల సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని అన్నారు. దసరా వరకు రెండో విడద మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు వస్తాయని తెలిపారు. దీనితోపాటు పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల కళ్లలో సంతోషం చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పంతడుపుల రాము, వార్డు అధ్యక్షులు వంగరి అనిల్, ఆకని సతీష్, శ్రీనివాస్, ప్రసాద్, ఏండి ఖలీం, కొండ ప్రకాశ్, మ్యాన పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : ఆర్థరైటిస్ (కీళ్లవాతం) సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డా.వేణుగోపాల్, డా.రాకేష్ సూచించారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ సహా పలు రకాలుగా ఇది కనిపిస్తుందన్నారు. ఆర్థరైటిస్ తీవ్రత, కీళ్లకు జరిగిన నష్టం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయిస్తారని ప్రారంభ దశలో వైద్యుల సూచనల మేరకు మందులు, ఫిజియోథెరపీ, తగిన వ్యాయామాలు, బరువు నియంత్రణతో ఉపశమనం పొందవచ్చన్నారు. వ్యాధి ముదిరి కీళ్లలో తీవ్రమైన నష్టం ఏర్పడి, మందులు ఇతర చికిత్సలతోనూ నొప్పి తగ్గకపోతే శస్త్ర చికిత్సను పరిశీలిస్తామన్నారు. నొప్పి తగ్గించే మందులను వైద్యుల సలహా లేకుండా తరచూగా వాడడం వల్ల కడుపులో అల్సర్లు, రక్తస్రావం, మూత్రపిండాలు, గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరగవచ్చన్నారు. అదే సమయంలో నొప్పిని నిర్లక్ష్యం చేయడం వల్ల కదలికలు తగ్గి రోజువారి జీవితంపై ప్రభావం పడుతుందని తెలిపారు. అధిక ఒత్తిడి పడకుండా చూడడం వైద్యుల సూచనలతో వ్యాయామం చేయడం, మందులను సూచించిన విధంగానే వాడడం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చని సూచించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో అనెస్థిసియా హెడ్ డా.వినయ్ కుమార్, మార్కెటింగ్‌మేనేజర్‌కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, ఆప్, కాక్రోజ్‌లు దేశద్రోహుల పార్టీలు

### సర్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

### కేంద్ర ఫిలింబోర్డు సభ్యుడు రాపాక ప్రవీణ్

ప్రజాపక్షం / మానకొండూర్ : దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, ఆప్, కాక్రోజ్ పార్టీలు పని చేస్తున్నాయని కేంద్ర ఫిలిం బోర్డు సభ్యులు లక్ష్మీ పూర్ ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీకీ ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక రాహుల్ గాంధీ ఓటు చోరీ అనే అబద్ధపు అంశాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. దేశంలో 95 కోట్ల మంది ఓటర్లు ఉంటే ఇప్పటికే 82 కోట్ల మంది ఓటర్లుగా 88 శాతం మంది నమోదు అయ్యారని అన్నారు. ఇంకా నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గతంలో ఈ దేశంలో 8 సార్లు నిర్వహించారని అత్యధికంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడే 7 సార్లు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ప్రతిపక్ష నాయకులు సచిన్ పైలెట్, శశితరూర్ వంటి నేతలు ఎస్ఐఆర్ వల్లనే బోగస్ ఓట్లు తొలగిపోయాయని గుర్తు చేశారు. స్థానిక కాంగ్రెస్ నేతలు ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగేటప్పుడు పోలింగ్ బూత్‌లలో ధర ఖాస్తు ఫారం నింపుతూ ప్రతి వారంలో సమావేశానికి హాజరైనారని ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు తీసివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రను ప్రజలందరూ గమనిస్తున్నారని దేశంలో మరోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రావుల శంకరాచారి, జిల్లాల రాజమౌళి, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మియాపురం లక్ష్మణాచారి, మండల ప్రధాన కార్యదర్శులు బాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్, పోచంపల్లి సర్పంచ్ అంబటి స్వామి, దేవంపల్లి ఉపసర్పంచ్ దాడి కార్తిక్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి వంగల అంజనేయులు, కత్తి ప్రభాకర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు పోచంపల్లి శ్రీనివాస్, మర్రి అంజనేయులు, సీనియర్ నాయకులు గాడిచెర్ల భూమయ్య, మార్కొండ రమేష్ పటేల్, మాచర్ల కోటేశ్వర్, మండల కార్యదర్శులు నందగిరి బలరాం, ఆరెపల్లి సునంద్ కుమార్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షులు అడప రవి, బిజేవైఎం జిల్లా నాయకులు తాడూరి కిరణ్ రెడ్డి, మడ్డి రాకేశ్, బిజేవైఎం మండల అధ్యక్షులు కొంద్ర వరప్రసాద్, కాల్వ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/కరీంనగర్: ప్రజావాణి కార్యక్రమానికి 138 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శాఖల వారీగా సమీక్షించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడిఓసి) సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 138 దరఖాస్తులు ప్రజల నుండి అందగా వాటి పరిష్కారానికి వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమానంతరం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు. ముఖ్యంగా పోలీస్, పంచాయతీ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్, ఎలక్ట్రిసిటీ, కార్పొరేషన్ శాఖల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్‌ఓ స్వామి, ఆర్‌డిఒ షర్మిల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇస్రాజ్ పల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

ప్రజాపక్షం/గొల్లపల్లి : ప్రజా పాలనలో భాగంగా ప్రతి ఒక్క అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఇందులో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇస్రాజ్ పల్లి గ్రామంలో చిర్ర రాజురసూల దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి విచ్చేసి నూతన గృహంలో అడుగుపెట్టిన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్న,ఇస్రాజ్ పల్లి మాజీ సర్పంచ్ చిర్ర గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ కొంద వెంకటేష్ గౌడ్,చిర్ర చంద్రయ్య, మారంపల్లి మల్లయ్యలతో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృగ జీవిని అటవీ శాఖ అధికారులకు అప్పగించిన రైతు రాజన్న

ప్రజా పక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీరుపూర్ మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో నుండి ఎండి తీవ్రత తో నీటి ఎద్దడి కారణంగా అటవీ ప్రాంతిని నీటి దాహం తీర్చుకోవడానికి జనావాసాల్లోకి వచ్చిన ఆ అరుదైన కొండగొర్రెను గ్రామస్తులు సహకారం తో అటవీ శాఖ అధికారులకు క్షేమంగా అందించారు.అటవీ సరిహద్దు ప్రాంతంలోని వ్యవసాయ బావి వద్దకు నీటి కోసం వచ్చిన కొండేగొర్రెను స్థానిక రైతు రాజన్న గమనించి స్థానిక గ్రామ సర్పంచ్ హరీష్ కు సమాచారం ఇవ్వగా తక్షణమే స్పందించి అటవీ శాఖ ఉన్నతాధికారులు విషయం చేరవేయడంతో అధికార యంత్రాంగం వేగంగా కదిలింది. అటవీ క్షేత్రధికారి శ్రీనాథ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వన్యప్రాణి తమ అధీనంలోకి తీసుకున్నారు. అనంతరం ఆ మూగజీవిని ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించేందుకు దర్మపురి పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు.దానిని సురక్షితంగా కరీంనగర్ జింకల సంరక్షణ కేంద్రానికి తరలించి అక్కడి అధికారులకు అప్పగించారు.ఈ రక్షణ చర్యలో స్థానిక సర్పంచ్ హరీష్ తో పాటు అటవీ శాఖ సెక్షన్ అధికారులు చంద్రారెడ్డి,ప్రకాష్,అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు ఆనందరావు,నవీన్,రవిందర్,జూనియర్ సహాయకులు ఎం గోపినాథ్ రెడ్డి,బేసిక్ క్యాంపు సిబ్బంది నర్సయ్య,నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ సౌకర్యాల ఏర్పాట్లు: సర్పంచ్ రేండ్ల శారద



ప్రజాపక్షం/రామగిరి: రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు కల్వచర్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రేండ్ల శారద కుమారస్వామి సద్దుల బతుకమ్మ సౌకర్యాల నిర్వహణ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గ్రామంలోని పెద్దమోరి మూల వాగు వద్ద గల బతుకమ్మ ఘాట్‌ను వేడుకల కోసం సిద్ధం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ సద్దుల బ తుకమ్మ పండుగకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఘాట్ పరిసరాలను శుభ్రం చేయిస్తూ, లైటింగ్ ఇతర కనీస వసతులను ఏర్పాటు చే సారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్ప.మహేందర్,ఆలయ కమి టీ చైర్మన్ రేండ్ల కుమారస్వామి వార్డు సభ్యులు మల్యాల పద్మ,గోనె రాము స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో రూ.15 లక్షల ఆస్తి బుగ్గిపాలు

## ఆసుపత్రిలో తండ్రి.. ఇంట్లో అగ్నిప్రమాదం.. కట్టుబట్టలే మిగిలిన కుటుంబం

**ప్రజాపక్షం/ఎండపల్లి :** అనుకోని అగ్నిప్రమాదం ఓ నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి,కళ్లముందే కష్టపడి సంపాదించుకున్న ఆస్తి మొత్తం అగ్నికి ఆహుతైంది.బంగారం, వెండి ఆభరణాలు, నగదు,దుస్తులు, విలువైన పత్రాలు సహా ఇంట్లోని సామగ్రి అంతా కాలి బూడిదైంది. సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లడంతో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఎండపల్లి మండల కేంద్రంలో దాసరి కళ్యాణి–కొమురయ్య కుటుంబానికి ఎదురైన ఈ విషాద ఘటన గ్రామస్థులను కలచివేసింది.వివరాల్లోకి వెళితే.. బాధితుడు కొమురయ్య తండ్రి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తండ్రి వైద్య ఖర్చుల కోసం అప్పు చేసి తెచ్చిన డబ్బులను ఇంట్లోని బీరువాలో భద్రపరిచి అనంతరం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా ఆసుపత్రికి వెళ్లారు అని బాధితుల సమాచారం. ఈ క్రమంలో ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి క్షణాల్లోనే ఇల్లు మొత్తం వ్యాపించాయి. ఇంట్లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, నగదు,దుస్తులు, విలువైన డాక్యుమెంట్లు సహా సామగ్రి మొత్తం కాలిపోయింది. కుటుంబం కోసం దాచుకున్న సొమ్ముతో పాటు నిత్యావసర వస్తువులు సైతం బూడిద కావడంతో బాధితుల పరిస్థితి దయనీయంగా మారింది.కష్టకాలంలో తండ్రి వైద్య ఖర్చుల కోసం అప్పులు చేసి,ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న కుటుంబానికి ఈ అగ్నిప్రమాదం మరో పిడుగులాంటి దెబ్బగా మారింది.కట్టుబట్టలు తప్ప మరేమీ మిగలకపోవడంతో బాధితురాలు కళ్యాణి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు చూసి గ్రామస్థులు సైతం చలించిపోయారు.



**బాధితులకు అండగా కుల సంఘం,సర్పంచ్ :** అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్థులు,ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు.తక్షణ సహాయంగా రెవెన్యూ సిబ్బంది నిత్యావసర సరుకులను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ కుల సంఘం తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రామ సర్పంచ్ సునీత జెలందర్ రెడ్డి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.సకాలంలో గ్రామంలోని ట్రాక్టర్ ట్యాంకర్‌తో మంటల అదుపునకు యత్నం ఈ క్రమంలో పంట పొలాలకు మందులు పిచికారీ చేసే ట్రాక్టర్ ట్యాంకర్ అగ్నిమాపక వాహనానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడింది. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది వచ్చేసరికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

**ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి :** ఈ ఘటనపై స్పందించిన రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్,ఆర్ఐ అన్వేష్, సెక్రటరీ కొమురయ్య, పోలీసు సిబ్బంది,విపిఒ ప్రతాప్ పాల్గొన్నారు.

# ఎన్‌ఒసిఇటి–2026 ప్రాంతీయ పోటీల్లో రామగుండం ఎన్‌టిపిసి జట్టు విజయం

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ఎన్‌టిపిసి రామగుండం & తెలంగాణకు చెందిన టీమ్ పర్యావరణ్ ఎన్‌ఒసిఇటి–2026 ప్రాంతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో విజయం సాధించిన జట్టు, జాతీయ స్థాయి పోటీల్లో దక్షిణ ప్రాంతం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ పోటీల్లో వల్లూరు, సింహాద్రి, కుడ్గి, రామగుండం & తెలంగాణ ఎన్‌టిపిసి కేంద్రాలతో పాటు దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయం (ఎస్‌ఆర్‌హెచ్‌క్యూ) జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న జట్లు తమ పరిజ్ఞానం, నైపుణ్యాన్ని ప్రదర్శించాయి. విజేత జట్టులో రవి వుప్పల, పొతు అశోక్, సాగర్ బరకాల, ఓంప్రకాశ్ బలరామ్ పటేల్ సభ్యులుగా ఉన్నారు. ఈ విజయం జట్టు సభ్యుల అంకితభావం, సమష్టి కృషి, ప్రతిభకు నిదర్శనమని ఎన్‌టిపిసిరామగుండం & తెలంగాణ యాజమాన్యం పేర్కొంది.

# రామగుండంలో సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం రైల్వే స్టేషన్‌లో ఆరు కీలక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని డివిజనల్ రైల్వే మెంబర్ అనుమాస శ్రీనివాస్ (జీన్స్) రైల్వే బోర్డును కోరారు. రైల్వే బోర్డు ఇడిఎంఇ(సేఫ్టీ)ఉన్నతాధికారి ఉత్కర్ష్‌ను సోమవారం కలిసి ప్రయాణికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎన్‌టిపిసి, ఆర్ఎఫ్‌సిఎల్, సింగరేణి వంటి సంస్థలు ఉండటంతో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారని వివరించారు.చెన్నై–జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, గరీబ్ రథ్, స్వర్ణజయంతి సూపర్‌ఫాస్ట్, నవజీవన్ సూపర్‌ఫాస్ట్, హిసార్–తిరుపతి, మిలీనియం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. దీనివల్ల పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంత ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.వినతిపై స్పందించిన రైల్వే బోర్డు అధికారి ఉత్కర్ష్, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# ధర్మపురి అభివృద్ధికి మంత్రి లక్ష్మణ్ కుమార్ కృషి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అహర్నిశలు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి లక్ష్మణ్ కుమార్ కృషితో ధర్మపురిలో లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాలను పునఃప్రారంభించడంతో పాటు, బుగ్గారం మండలానికి తహసీల్దార్ కార్యాలయం, ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, చెగ్యాం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ భూనిర్వాసితులకు రూ.18 కోట్ల పరిహారం మంజూరైందని వివరించారు.అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని, వైద్య చికిత్సల కోసం ఇప్పటివరకు రూ.7.5 కోట్ల ఎల్‌ఓసీలు అందించామని తెలిపారు. గోదావరిలో మురుగునీరు కలవకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మంజూరైందని, రానున్న గోదావరి పుష్కరాలను భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, పెగడపెల్లి మండల అధ్యక్షుడు కడారి తిరుపతి, గొల్లపల్లి మండల అధ్యక్షుడు గంగన్న, ధర్మపురి మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్,శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ పాలక మండలి మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్,కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సుధాకర్, సుముఖ్,ప్రసాద్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితుల ఆందోళన నిర్వాహకుడి ఇంటికి తాళం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** తాము కష్టపడి రూపాయి రూపాయి పోగేసి చిట్టీలు కడితే తిరిగి తమ డబ్బు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నాడని మొగిలిపేట గ్రామానికి చెందిన బాధితులు ఆందోళన చెందుతూ అదే గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్ అనే చిట్టి నిర్వాహకుడి ఇంటికి తాళం వేయడం చర్చనీయాంశమైంది. చిట్టి నిర్వహించే గంగాధర్ తమ డబ్బులు ఇవ్వకుండా డొంక తిరిగే సమాధానాలు చెబుతూ తప్పించుకుంటున్నాడని, ఈ విషయం గ్రామపంచాయతీలో సైతం పిలిపించి నిలదీసినప్పటికీ డబ్బులు ఇస్తానంటూ మాట మారుస్తున్నాడని,కచ్చితంగా అడిగితే దుర్భాషలాడడంతోనే ఇంటికి తాళం వేసినట్లు బాధితులు తెలిపారు. కాగా ఈ పంచాయతీ కాస్త పోలీసులకు చేరడంతో కానిస్టేబుల్ అక్కడికి చేరుకొని బాధితులతో నిర్వాహకుడుతో మాట్లాడినప్పటికీ విషయం పెద్దది కావడంతో పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేసి మాట్లాడుకోవాలని వెళ్లిపోయారు. చిట్టి నిర్వాహకుడు గంగాధర్ గతంలో సైతం వడ్డీ వ్యాపారం చిట్టి నిర్వహణ విషయంలో పోలీసులు దాడులు చేసి హెచ్చరించిన సందర్భాలు కూడా ఉన్నాయి.అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని చిట్టి నిర్వహిస్తూ ప్రజలకు టోకర కొడుతున్న ఇలాంటి నిర్వాహకులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప అమాయకపు జనాలు మోసపోతూనే ఉంటారు మరి.

# అధ్వానంగా ఆలయ కట్టకింది రహదారి

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో ఉన్న ముత్యాల పోచమ్మ ఆలయ కట్టకింది రహదారి సరిగా లేకపోవడంతో రైతులు,భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తాజాగా ఈ రహదారిపై మొక్కజొన్న ధాన్యాన్ని తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన రైతు, ట్రాక్టర్ యజమాని పుస్తెం చిన్న భూమన్న,మరో రైతు ఓజ్జెల చిన్నయ్యకు చెందిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తూ, పెద్ద చెరువు సమీపంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద ఉన్న కల్లంలో ఆరబెట్టేందుకు కట్టకింది రహదారి మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో రహదారి సరిగా లేకపోవడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది.ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

**భక్తులకు తప్పని ఇబ్బందులు :** ముత్యాల పోచమ్మ ఆలయానికి ఇబ్రహీంపట్నం గ్రామంతో పాటు వివిధ మండలాల నుంచి ఆది, బుధ వారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తమ వాహనాల్లో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ఆలయ కట్టకింది రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు సరిగా లేకపోవడం వల్ల భక్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారులు స్పందించాలి :** రహదారి సమస్యను ఇప్పటికైనా సంబంధిత అధికారులు,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు గుర్తించి పరిష్కరించాలని రైతులు పుస్తెం చిన్న భూమన్న, ఓజ్జెల చిన్నయ్యతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు. భక్తులు, రైతుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారిని మెరుగుపరిచి, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇరిగేషన్ ఎఇ వివరణ :** ఈ రహదారి సమస్యపై ఇరిగేషన్ శాఖ ఏఈ చేతన్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా, కట్టకింద రహదారి పరిధి సుమారు ఒక గొలుసు వరకు ఉంటుందని తెలిపారు.ఈ రహదారి విషయమై గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించినట్లు వివరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో చర్యలు తీసుకొని రహదారి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తే రైతులు,భక్తులకు ఇబ్బందులు తొలగడంతో పాటు ప్రమాదాల ముప్పు తగ్గే అవకాశం ఉంది.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండబెడుతున్న విద్యుత్ కోతలు



**ప్రజాపక్షం/ముత్తారం:** అసలే పెట్టుబడులు పెరిగి అతలాకుతలమవుతున్న రైతులకు,ప్రస్తుత విద్యుత్ కోతలు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన కారుపాకల సంపత్ అనే కౌలు రైతు పరిస్థితి ఇందుకు అద్దం పడుతోంది. సంపత్ దాదాపు 3 నుండి 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని ఎంతో ఆశతో పంట సాగు చేశారు.పంట బాగా పెరిగి చేతి కొచ్చే తరుణంలో,గత కొన్ని రోజులుగా ఊహించని విధంగా విధిస్తున్న విద్యుత్ కోతల వల్ల పొలానికి సక్రమంగా నీరందడం లేదు. దీనితో పచ్చగా కళకళలాడాల్సిన పంట పొలం కళ్లముందే పూర్తిగా ఎండి పోతోంది. వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడిగా పెట్టానని, ఇప్పుడు కరెంట్ లేక పంట ఎండిపోతుంటే ఏం చేయాలో తోచడం లేదని ఆ రైతు తల్లడిల్లిపోతున్నారు.ప్రభుత్వం,విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి,తగినన్ని గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించి తమలాంటి కౌలు రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పూల పండుగ బతుకమ్మ పండుగ సందర్భంగా సోమవారం సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్, న్యాయవాదులు,కోర్టు సిబ్బంది బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జడ్జి దుర్గం గణేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ,ఎజిపి దూడం ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు లక్ష్మీరాజం, ఆంజనేయులు, శ్రీరాములు, సరోత్తం రెడ్డి, రమేష్, భూమయ్య, రాజేంద్ర ప్రసాద్, కరుణాకర్, నర్సయ్య, శ్యామ్,వేముల స్నేహ,రామకృష్ణ రెడ్డి, శ్రీనివాస్, కోర్టు సిబ్బంది శ్రీనివాస్,రామకృష్ణ, సుమన్,సువర్ణ,శరణ్య,పద్మజ, రజని,శిరీష, హారిక,మౌనిక,పోలీస్ సిబ్బంది దేవరాజ్ పాల్గొన్నారు.

# నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

తహసీల్దార్ అడా బిర్వ

ప్రజాపక్షం / జైనూర్: మండలంలోని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ది దారులకు మంగళవారం చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అడా బిర్వ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే లబ్దిదారులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించామని, అర్హులైన వారు సకాలంలో కార్యాలయానికి చేరుకొని చెక్కులు తీసుకోవాలని సూచించారు.

# ఎస్‌టి సెల్ మండల అధ్యక్షుడిగా భుజంగ్ రావ్



ప్రజాపక్షం / జైనూర్: మండల కాంగ్రెస్ ఎస్‌టి సెల్ అధ్యక్షుడిగా పారా గ్రామానికి చెందిన కుమ్ర భుజంగ్ రావ్ నియమితులయ్యారు. డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆమోదంతో నూతన కార్యవర్గాన్ని ప్రకటించినట్లు మండల అధ్యక్షుడు షేక్ రషీద్ తెలిపారు. ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం పారాలో గ్రామ పటేల్ కుమ్ర నగేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు భుజంగ్ రావును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పదవికి సహకరించిన డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఇంచార్జ్ శ్యామ్ నాయక్, మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మండల అధ్యక్షుడు షేక్ రషీద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుమ్ర లక్ష్మణ్, సంజీవ్, యదో రావ్, ఆత్రం గున్వంత్, సోమ్జి, భీంరావ్ పాల్గొన్నారు.

# కాండ్లిలో వైభవంగా పూజలు



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని కాండ్లి గ్రామంలోని దుర్గాదేవి శరన్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు గాయత్రీ దేవికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు ప్రత్యేక పూజలు అభిషేకాలు దుర్గాదేవికి నిర్వహిస్తామని మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు గ్రామస్తులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే పాడిపంటలు, వ్యాపారాలు వృద్ధి చెందాలని, ఆయురారోగ్యంగా ఉండాలని దుర్గాదేవికి కోరుకుంటారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విడిసి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / నస్పూర్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, డిఆర్‌ఒ మోతిరామ్‌లతో కలిసి ఆయన ప్రజల నుంచి 47 దరఖాస్తులను స్వీకరించారు. బేకరీ కార్మికుల వేతనాలు, నిషేధిత భూముల సవరణ, గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం, నీల్వాయి ప్రాజెక్టు కాలువ పూడికతీత, ఆసుపత్రిలో ఉపాధి, పోడు భూముల వివాదాలు, ఇందిరమ్మ ఇళ్లు, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలపై అర్జీదారులు వినతులు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. వెట్టిచాకిరీ, బలవంతపు శ్రమల నిర్మూలనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, హెల్ప్‌లైన్ నంబర్ 080 6943434 పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు క్రాంతి కుమార్, కిషన్, రౌఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# యువతలో ఐక్యత పెంచడానికే క్రికెట్ పోటీలు

విజేతగా నిలిచిన వాసవి యూత్ క్లబ్



ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ : క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ యువతలో ఐక్యతను పెంచేందుకే బాక్స్ క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు అంతర్జాతీయ వాసవి క్లబ్స్ ఉపాధ్యక్షులు సిపురం రాజేశ్, ముక్త శ్రీనివాస్, కటుకు హరీష్ తెలిపారు. ఆదివారం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని జెర్సీ 7 బాక్స్ క్రికెట్ స్టేడియంలో వాసవి క్లబ్స్ జిల్లా 107 ఎ స్థాయి బాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు ముక్తా విశ్వాస్ సారథ్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో మధురం జట్టుపై వాసవి యూత్ క్లబ్ 38 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీతో పాటు రూ. 10 వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన మధురం జట్టుకు రూ. 7,500, తృతీయ స్థానంలో నిలిచిన చిలువేరు జట్టుకు రూ. 5 వేల పారితోషికం అందజేశారు. ఉత్తమ బ్యాటర్‌గా తనుకు అరిత్, బౌలర్‌గా నాగిశెట్టి వర్షిత్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా తనుకు అరిత్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాదంశెట్టి సత్యనారాయణ, చిలువేరు జ్యోతి శ్రీనివాస్, క్లబ్ జిల్లా గవర్నర్ బాలమోహన్, వైకుంఠం, గుర్రాల శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, కొంకుముట్టి వెంకటేశ్, అక్కెనపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో మెరుగైన వసతులు కల్పించాలి

అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



ప్రజాపక్షం / నస్పూర్ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రంథాలయంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ చదువుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడి అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రంథాలయంలోని మరుగుదొడ్లకు నిరంతరం నీటి సౌకర్యం ఉండేలా చూడాలని, గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నూతనంగా కొనుగోలు చేసిన పుస్తకాలను పరిశీలించిన ఆయన, వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పక్కా ప్రణాళికతో, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివి కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



ప్రజాపక్షం/దిలావర్ పూర్ : మండలంలోని సాంగ్వి గ్రామంలో మహా గంగా, పోచమ్మ గంగా నీళ్ల జాతర 17, 18 తేదీలలో మహా జాతర నిర్వహించడం జరుగుతుంది కావున వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గంగా పోచమ్మను దర్శించుకుని గంగా నదిలో స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అవుతారు కావున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అదెల్లి పోచమ్మ ఆలయ ఇఒ భూమయ్య, మాజీ ఆ లయ కమిటీ చైర్మన్ భోజ గౌడ్, సభ్యులు, ఉట్ల రాజేశ్వరి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్,పత్రి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాధవరావు, లావర్ పూర్ ఎస్‌ఐ రవీందర్, సాంగ్వి సర్పంచ్ రుక్మవ్వ, సుభాష్ రావు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మరియు వీడీసీ గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి జాతరకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని గంగా నది వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.తెల్లవారుజామున నుండి భక్తులు గంగా స్నానానికి రావడం జరుగుతుంది కావున రోడ్డు పక్కన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

# సూరు గద్దెకు స్థలం కేటాయించాలి

ప్రజాపక్షం / జైనూర్: కొమురం సూరు వర్ధంతి సందర్భంగా జెండా ఆవిష్కరణకు గద్దె నిర్మాణానికి స్థలం కేటాయించాలని కొలాం సేవా సంఘం నాయకులు కోరారు. సోమవారం జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల సంఘం ప్రతినిధులు స్థానిక తహసీల్దార్ బిర్ షాకు వినతిపత్రం అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఇందుకు అనువైన స్థలాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు కొమురం సూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆత్రం బాపూరావు, రాజు, ఆత్రం భీంరావు, కొడప భీంరావు, కొడప రాజు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా అనిల్



ప్రజాపక్షం / కౌటాల: తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) దివ్యాంగుల విభాగం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అనిల్ కొసన్ కార్ నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు కిరిమిల్ల వినోద్ చారి ఆయనకు అధికారికంగా బాధ్యతలు అప్పగించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్ కొసన్ కార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ, పంచజన్య సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కావేటి సబిత మనోహర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, ట్రెజరర్ మాచర్ల శ్రీనివాస్, ఆత్రం వినోద్, సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి మౌర్కర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# 20 గంటల విద్యుత్ అందించాలి

విద్యుత్ ఎఇకి రైతుల వినతి

ప్రజాపక్షం / కౌటాల: సాండ్ గాం గ్రామానికి రోజుకు 20 గంటల పాటు 3ఫేజ్ వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ గ్రామ రైతులు సోమవారం స్థానిక విద్యుత్ శాఖ ఎఇకి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో దాదాపు 150 మంది రైతులు వరి, మిరప పంటలను సాగు చేస్తున్నారని వారు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 8 నుంచి 9 గంటలే కరెంట్ ఇస్తుండటంతో, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలకు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు వెంటనే విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# వేలాలలో ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం / జైపూర్: మండలంలోని వేలాల గ్రామంలో కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి, ఏఎన్‌ఎంలు రాణి, రమ, ప్రియ, ఆశా కార్యకర్త రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ విఫలం

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు స్వప్నరాణి



ప్రజాపక్షం / మంచిర్యాల: కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పచ్చ స్వప్నరాణి విమర్శించారు. మణిపూర్ కాంగ్రెస్ ఎంపి అంగోంచ భీమోల్ విద్యార్థినులను వేధించడాన్ని నిరసిస్తూ సోమవారం మంచిర్యాలలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, ఎంపి భీమోల్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా స్వప్నరాణి మాట్లాడుతూ విద్యార్థినులపై వేధింపులకు పాల్పడిన ఎంపి భీమోల్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా కాంగ్రెస్ నాయకత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకురాళ్లు బైరాన్ లక్ష్మి, బొంగోని శిరీష గౌడ్, ఎడ్ల స్వరూప, మాదాసు సృజన దేవి, తూటి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత



ప్రజాపక్షం/నేరడిగొండ: అనారోగ్యంతో మృతి చెందిన నేరడిగొండ మండలం గుత్పాల గ్రామానికి చెందిన మడవి అనసూయ ఎల్ఐసీ పాలసీకి సంబంధించిన రూ. 1,38,000 చెక్కును ఆమె కుమారుడు మడవి ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. ఎల్ఐసీ అధికారులు, అడ్వైజర్ లింగంపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఈ చెక్కును పంపిణీ చేశారు. కుటుంబానికి బీమా ధీమా ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి బాయి భీంరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌కు సన్మానం



ప్రజాపక్షం/నేరడిగొండ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా నూతన చైర్మన్ అడే క్రాంతి కుమార్‌ను 'లైవ్' జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. మానవసేవే లక్ష్యంగా ఆదిలాబాద్ జి ల్లా ప్రజలకు రెడ్ క్రాస్ సేవలు మరింత వి స్తృతంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నా రు.
ఈ వార్తకు ఫోటో ఉంది.

## బాధితులకు న్యాయం చేయాలి

### ఎస్‌పి మహేష్ బి గితే



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 17 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని అన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా కలుగుతుందని అ న్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నా రు.

# ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు అవగాహన

### అనుభవాలు పంచుకున్న ఆదర్శ రైతు



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రబీ పంటల ప్రణాళిక, పంటల మార్పిడి, అనువైన పంటల ఎంపిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులను సమన్వయపర్చి క్షేత్రస్థాయిలో రైతులు పంటల వైవిధ్యీకరణ అవలంభించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు వీలుగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించింది. ఉపముఖ్యమంత్రిమల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, వ్యవసాయ, ఉద్యానవన, వాతావరణ, విద్యుత్ భూగర్భజలాలు తదితర శాఖల అధికారులు, వ్యవసాయా శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. బోధన్ డివిజన్ ఎడపల్లి మండల కేంద్రంలోని రైతువేదిక నుండి కలెక్టర్ ఇలా త్రిపాఠి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. జిల్లాలో యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అధిక లాభాలు అందించే ఆయిల్‌పామ్ పంట దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్దంగా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో పంటలు సాగచేసి నష్టపోవద్దని కొత్తగా నాటిన ఉద్యాన పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఎల్‌నినోపై వచ్చే వదంతులను నమ్మకుండా రైతులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో వ్యవహరించి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహకరించాలని కోరారు. రైతు నేస్తంలో తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగరావు, విజయకుమారి, వీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులకు మానసిక ఆరోగ్య అవగాహన



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటు పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొంటు భావోద్వేగ సమతుల్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని పలువురు తెలంగాణా సైకాలజి నిపుణులు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల పద్మనాయక హాలులో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కృష్ణవేణి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంప్‌లో విద్యార్థులకు మానసికంగా ధైర్యంగా ఉండటానికి పలు సూచనలు చేశారు. మనసును వినాలి మార్పును తేవాలి అనే సందేశంతో మానసిక ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకుని బాధలో ఉన్న వారి మాటలను శ్రద్ధగా వినడం, వారి అనుభవాలకు ప్రాధాన్యత ఇవ్వడం, అవసరమైన సమయంలో తగిన సహాయం అందింహచడం వంటి అంశాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పరీక్షల ఒత్తిడి ఫలితాలపై ఆందోళన, మార్కులు ర్యాంకులపై భయం, కుటుంబ సభ్యుల అంచనాలు, ఆర్థిక ఇబ్బందుల, ఉద్యోగ సాధనలో ఎదురయ్యే సవాళ్ళ కారణంగా మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొవడానికి విద్యార్థులు సంయమనం పాటించి చదువుతో పాటు తగిన విశ్రాంతి తీసుకోవడం, తమ భావోద్వేగాలను సమతుల్యం చేసుకోవడం, సానుకూల ఆలోచన విధానాన్ని అలవర్చుకోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్, ప్రధానకార్యదర్శి సుమనచైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నారాయణరావు, టిపిఎ సలహాదారు కృష్ణవేణి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత కస్తూరి పద్మచరణ్, గుండేటి యోగేశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన వ్యవస్థలను నిర్మించాలి

### డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి



ప్రజాపక్షం / జన్నారం: విద్యాసంస్థలు వ్యవస్థాపకులు లేకున్నా తరతరాల పాటు విలువలతో కొనసాగేలా నాయకులు వ్యవస్థలను నిర్మించాలని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. జన్నారంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'పరివర్తన్' నాయకత్వ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు కేవలం సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా, తమ ప్రమేయం లేకున్నా సమర్థవంతంగా పనిచేసే విధానాలను తీసుకురావాలన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 100 మంది విద్యాసంస్థల అధినేతలకు శిక్షణ అందించామని, వారి ద్వారా 100 పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ సమాజానికి విలువలను అందించే సంస్థల నిర్మాణమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 మంది విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

## పెంబిలో పిపిఎల్ 5 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాపక్షం/పెంబి : సోమవారం పెంబి మండలంలో ప్రారంభమైన పిపిఎల్ 5 క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఖానాపూర్ నియోజకవర్గం బి ఆర్ఎస్ నాయకుడు ప్రారంభించారు.తదనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని తమ ప్రతిభ కనబరచాలని ఇంకా ఉన్నత స్థాయి జిల్లా, రాష్ట్రం జాతీయస్థాయిలో గుర్తింపు పొందేటట్లు ఎదగాలని క్రీడాకారులకు సూచించారు ఈ పి పి ఎల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బి ఆర్ ఎస్నాయకుడు జాన్సన్ నాయక్‌తో పాటు స్థానిక సర్పంచ్ మల్లేపల్లి సామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్లా సప్నిల్ రెడ్డి, బిఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఇతర గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మాలధారణ చేసిన వారిని విధుల్లోకి అనుమతించకపోవటంపై అభ్యంతరం

ప్రజాపక్షం/ఆర్మూర్ : మున్సిపల్ కేంద్రంలో దుర్గామాత మాలధారణ చేసిన స్వాములను విధుల్లోకి అనుమతించలేదని వరున్ మోటార్స్ యాజమాన్యంపై ఈ విషయం తెలుసుకున్న హిందూ వాహిని అధ్యక్షుడు మందుల బాలు అక్కడికి చేరుకుని మేనేజర్‌తో పాటు యాజమాన్యంతో మాట్లాడి, మాలధారణ చేసిన స్వా ముల పట్ల వ్యవహరించిన తీరుపై తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసి మాట్లాడారు. హిందూ సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మత విశ్వాసాలకు అనుగుణంగా మాలధారణ చేసుకున్న స్వాముల పట్ల వివక్ష చూపడం సరైన పద్ధతి కాదన్నారు.మతవిశ్వాసాలను గౌరవిస్తూ ప్రతిఒక్కరి ఆచారాలకు తగిన గౌరవం కల్పించాలని ఉద్యోగులతో వివక్షతకు తావు లేకుండా యాజమాన్యాలు వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

## నూతన సిఐగా చంద్రశేఖర్



ప్రజాపక్షం/ఆర్మూర్ : ఇటీవల నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన కొండి చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్ర ణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించటం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పో లీసులను సంప్రదించాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రజనీకాంత్, రాంకిరణ్ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు శనివారం వైభవంగా జరిగాయి.ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ అమరేందర్ రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆసుపత్రి ప్రాంగణంలో జరుపుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం సంతరించుకుంది. ఆసుపత్రిలోని మహిళా ఉద్యోగులు,సిబ్బంది అందరూ క లిసి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు మహిళా సిబ్బందికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలు అం దించే సిబ్బందికి మానసిక ఉల్లాసం అవసరమని, ఇలాంటి సాంస్కృతిక వేడుకలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారితో పాటు ఆసుపత్రి సిబ్బంది, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## సత్యనారాయణ గౌడ్ నవమి దిన కర్మ



ప్రజాపక్షం/రామగిరి : సోమవారం రామగిరి మండలం సుందిళ్ల గ్రామానికి చెందిన సుందిళ్ల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ చైర్మన్ కీర్తిశేషులు కొరకొప్పుల సత్యనారాయణ గౌడ్ నవమి దిన కర్మ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవక్క, నాగేపల్లి మాజీ సర్పంచ్ ఓదెలు,మాజీ ఎంపీటీసీ హేమలత,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు నరేష్ యాదవ్,సుందిళ్ల గ్రామశాఖ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలి

మంత్రులు భట్టి, తుమ్మల
ఎల్ నినో ప్రభావంతో తగ్గనున్న నీటి లభ్యత
వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రుల దిశానిర్దేశం



ప్రజాపక్షం/ముత్తారం : రాబోయే యాసంగి పంట కాలంలో ఎల్ నినో ప్రభావం కారణంగా నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున,రైతులు అప్రమత్తంగా ఉండి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్ర మార్క,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ ఖమ్మపల్లి రైతు వేదికలలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారు రైతులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, అధిక నీరు అవసరమయ్యే వరి పంట సాగును తగ్గించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. వరికి బదులుగా ఆయిల్ పామ్, కూరగాయలు, అపరాల పంటలైన పెసర, మినుము, బబ్బెర, ఉలవలతో పాటు నూనెగింజల పంటలైన నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి పంటలను సాగు చేసుకోవడం లాభదాయకమని వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించేందుకు రైతులు బిందు సేద్యం, తుంపర సేద్యం పద్ధతులను అనుసరించాలని మం త్రులు పిలుపునిచ్చారు. అలాగే పొలాల్లో ఇంకుడు గుంతలను నిర్మించడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులు వానాకాలం వరి పంట కోత అనంతరం వరి గడ్డిని తగలబెట్టకుండా, వాటిని గడ్డి చుట్టలుగా కట్టి నిల్వ చేసుకోవాలని సూచించారు. పచ్చి పశుగ్రాసం కొరత తీరడానికి జొన్న, సూపర్ నేపియర్, హెడ్జ్ లూసర్న్, బర్సీమ్, అలసంద, మొక్కజొన్న వంటి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైదంబండ రైతువేదికలో సర్పంచులు ఐతే చంద్రమౌళి, చొప్పరి సంపత్, ప్రజాప్రతినిధులు మెంగని తిరుపతి, గాదం శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారి జె. అనూష, ఏపీఎం జి. స్వరూపారాణి,ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, సీసీ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం / మానకొండూర్ :** ఊటూరు గ్రామానికి చెందిన రామగుండం లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్, సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి, ముద్దసాని ప్రమోద్ రెడ్డి, లక్ష్మారెడ్డి సోదరులు తమ తల్లి ముద్దసాని వసుమతి దేవి స్మారకార్థం పేద ప్రజల కోసం కరీంనగర్, రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి ఐ హాస్పిటల్, వెంకటాద్రి హాస్పిటల్ సంయుక్త సౌజన్యంతో సోమవారం మానకొండూర్ మండలం ఊటూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి, దంత వైద్య, జనరల్ ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత శిబిరంలో 167 మందికి కంటి పరీక్షలు, దంత చికిత్సలు నిర్వహించి ఉచితంగా కళ్ల అద్దాలు, మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రోగ్రాం చైర్మన్ లయన్ విద్యాసాగర్, పి ఎంజెఎఫ్, పిఆర్‌సి, ప్రోగ్రాం కో చైర్మన్ లయన్ సంపత్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ ప్రదీప్ రెడ్డి, లయన్ శివకాంత్, పి ఎంజెఎఫ్ కరీంనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం భీమ్‌రాజుపల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి.శ్రీ దుర్గ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆదివారం రాత్రి గ్రామ పురవీధుల్లో డప్పుచప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ప్రతిమను భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి ఘనంగా ప్రతిష్ఠించారు. సోమవారం ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యచార్యుల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు, హోమం, గాయత్రీ మంత్ర హవన పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా పలువురు భక్తులు నియమనిష్టలతో భవానీ మాత దీక్షలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా భవాని సేవా సమితి వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్,గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి,ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మతో పాటు ఆలయ పాలకవర్గ సభ్యులు,భవానీ మాత దీక్షా స్వాములు,గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయికుమార్ సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



**ప్రజాపక్షం/ముత్తారం :** పారుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ ప్రథమ చికిత్స వైద్యులు, స్వర్గీయ డాక్టర్ బియ్యాని సాయికుమార్ సమాజానికి చేసిన నిస్వార్థ సేవలు ఎన్నటికీ మరువలేనివని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కొనియాడారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామ శివారులోని సాయికుమార్ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఆయన విగ్రహావిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు.. సాయికుమార్ సతీమణి యశోద, కుమార్తెలు ఐశ్వర్య, సిరివల్లి తో పాటు వివిధ పార్టీల నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ.. డాక్టర్ సాయికుమార్ తన సేవా గుణంతో పారుపల్లి గ్రామానికి విపరీతమైన పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టారని స్మరించుకున్నారు. డాక్టర్ సాయికుమార్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం కూడా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయికుమార్ మంచికి మారుపేరని, ఆయన సేవలు సమాజానికి ఎంతో ఆదర్శదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బియ్యని శివకుమార్, ఉప సర్పంచ్ శ్యామల బాపు గౌడ్, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయి

ప్రజావాణిలోఅధికారులకు
వినతిపత్రం అందించిన రైతులు




**ప్రజాపక్షం/ముత్తారం :** విద్యుత్తు సరఫరా లో అంతరాయం ఏర్పడడంతో తమ పంటలు ఎండిపోతున్నాయి సార్ అంటూ.. సోమవారం పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేసనపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు మాజీ సర్పంచ్ నూనె కుమార్ తో కలిసి ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. సోమవారం పెద్దపల్లి జిల్లాముత్తారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూనె కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తాహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోవోల్టేజ్ సమస్యతో పాటు కరెంటు హెచ్చుతగ్గులు అవ్వడం వల్ల పొలాల వద్ద మోటర్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో విద్యుత్ సమస్య చాలా ఆందోళనకరంగా మారిందని వినతిపత్రంలో పేర్కొన్నారు.కరెంటు సరిగ్గా లేకపోవడంతో పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో కూడా కరెంటు సింగిల్ ఫేస్ రావడం వల్ల వృద్ధులు,చిన్న పిల్లలు,ప్రజలు నిద్రలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి, తక్షణమే ముత్తారం మండలానికి నాణ్యమైన కరెంటు సరఫరా చేసి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలు, జంగ స్వామి, శ్రీనివాస్, తిరుపతి,శ్రీనివాస్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐదు గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల ప్రారంభం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, కోమటి కొండాపూర్, ఎర్దండి గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.అనూప్ రావు తదితర నాయకుల తో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు నియోజక వర్గ ఇన్చార్జ్ డాక్టర్ అనుపరావు మాట్లాడుతూ ఒక్కో హైమాస్ట్ లైట్‌కు రూ.1 లక్ష 33 వేల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీ నారాయణ, రాపెల్లి సురేష్, తీగల శ్రీధర్ రెడ్డి, పుప్పాల మహేందర్, గుండేటి శేఖర్, పుప్పాల రాజారెడ్డి, గుండేటి సతీష్, అమ్మక్కపేట్ సర్పంచ్ కాసిరెడ్డి భాస్కర్ రెడ్డి,సురకంటి భూమన్న,ఎల్లాల జలంధర్,బద్దం రాజశేఖర్,ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ నివాసితులు, భక్తుల సమక్షంలో దుర్గాదేవి అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లీడర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గ్రామంలోని లీడర్ యూత్ సభ్యుల ప్రత్యేక ఆధ్వర్యంలో ఈ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజున గాయత్రి దేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్య అర్చకులు నవీన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు, మంత్రోచ్ఛారణలు నిర్వహించారు. ఈ పూజా మహోత్సవంలో దుర్గా మాలధారణ భక్తులు రవీందర్,సత్యనారాయణ,సాయి, శేఖర్,అజయ్, రాములతో పాటు గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## 14న సింగరేణి కార్మిక గర్జన



**ప్రజాపక్షం/అంతర్గాం :** గోదావరిఖనిలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఈనెల 14న బిఆర్ఎస్ పార్టీ, తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరగనున్న సింగరేణి కార్మిక గర్జన, బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కౌశిక హరి కోరారు. సోమవారం అంతర్గాం మండలంలో ఆయన కార్మిక గర్జన కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభకు బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రధానంగా సింగరేణి సంస్థను ఒక ఎటిఎంలాగా వాడుకుంటూ సంస్థకు, కార్మిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా నష్టం చేస్తుందనే విషయమై ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సింగరేణి కార్మికులు, రామగుండం నియోజకవర్గ ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కొల్లూరి సతీష్, బండారి ప్రవీణ్‌కుమార్, నాయకులు కాలువ శ్రీనివాస్, చింతకింది సంపత్, గ్యాలంకి ప్రసాద్, మల్లేష్, ప్రశాంత్ గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో తెలంగాణ జాగృతి బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ అస్తిత్వానికి,సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన పూల పండుగ బతుకమ్మ సంబరాలు పెద్దపల్లిలో కన్నులపండువగా సాగాయి.తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు మేడారపు రాజ్యలక్ష్మి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.ఈ సంబరాలకు తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మరిపెల్లి మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళలంతా లయబద్ధమైన చప్పట్లతో జానపద పాటలు ఆలపించారు.ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ఐదు బతుకమ్మలను ఎంపిక చేసి, వాటిని రూపొందించిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకరి రజిత,నాయకురాళ్లు మమతారాణి, శారద, రోజారమణి, ముస్త్యాల స్వప్న,శ్రీలత,అర్నకొండ సరిత,అర్నకొండ పద్మ, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

